క్లుప్తంగా

నేడు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని ఆర్య వైశ్య భవన్‌లో గోవర్ధనగిరి గోశాల ఆదిగురు భారత సంఘం ఆధ్వర్యంలో బుధవారం సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సేంద్రీయ వ్యవసాయ సాగుపై ఆసక్తి గల రైతులు హాజరు కావాలని కోరారు. విత్తన శుద్ధి, ప్రకృతి గో ఆధారిత ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయం, సేద్యం, వైద్యం అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి

భువనగిరి : సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని జీనియస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 461 మార్కులు సాధించిన సీహెచ్ చిన్మయి, 446 మార్కులు సాధించిన జి ఆక్షిత, 433 మార్కులు సాధించిన స్వరహాసినిలకు సన్మానించారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, చైర్మన్ పడాల శ్రీనివాస్, డైరెక్టర్ తోట శ్రీధర్, ప్రిన్సిపల్ స్వర్ణలత,ఏవో జీ రవి, అకాడమిక్ ఇంచార్జి జయేష్,రాజేశ్వరీ, అరుణ, పీఈటీ శ్రీకాంత్ ఉపాధ్యాయులు రాధిక, సౌజన్య, కళ్యాణి పాల్గొన్నారు.

ప్రజలకు కృతజ్ఞతలు

భువనగిరి టౌన్ : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సీపీఎంను ఆదరించి ఓట్లు వేసిన ప్రజలకు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మోత్కూరు : మండలంలోని పాలడుగు బీజేపీ నూతన గ్రామ శాఖ కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా కందికట్ల యమకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఆళ్ల శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బరిగెల శేఖర్, కోశాధికారిగా గునగంటి అలందర్, శ్యామల నరేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ధీటి సందీప్, ఉపాధ్యక్షుడు గూదె మధుసూదన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

మోత్కూరు : ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు మంగళవారం రాత్రి కురిసిన వర్షం ఉపశమనాన్ని కలిగించింది. మండల వ్యాప్తంగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి పడిపూజ



పూజలు నిర్వహిస్తున్న హనుమాన్ మాలధారులు

బొమ్మలరామారం : మండలంలోని బోయిన్‌పల్లి గ్రామంలో మంగళవారం హన్‌మాన్ పడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడబోయిన నర్సింగ్‌రావు గురుస్వామి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక పూజలతో పాటు భక్తి గీతాల ఆలాపన, మాలధారుల నృత్యాలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భుక్యా హరి నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హన్‌మాన్ మాల ధారులు ధీరావత్ రాంసింగ్, ,దీరావత్‌లింగా నాయక్, రాజు, లోక్యా నాయక్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వలిగొండ : మండలంలోని వర్కటపల్లి గ్రామానికి చెందిన చెన్నగొని బాలమణి మంగళవారం మృతిచెందింది. ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రూ.8 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

రాజాపేట : మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన తంబునూరి లక్ష్మణ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1995–96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతుడి కుమార్తె పేరు మీద రూ. 45వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్‌పేపరును అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దొంగల ‘ప్రాంగణం’

- భువనగిరి బస్టాండ్‌లో చెలరేగుతున్న దొంగలు
- లబోదిబోమంటున్న ప్రయాణికులు
- సీసీ కెమెరాలు, పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలని డిమాండ్



భువనగిరి బస్టాండ్

భువనగిరి క్రైమ్ : నిత్యం 30 నుంచి 40 వేల మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే భువనగిరి బస్టాండ్‌లో దొంగల బెడద రోజు రోజుకు పెరుగుతుంది. మూడు నెలల్లో 30కి పైగా దొంగతనాలు జరిగాయంటే పరిస్థితి ఇట్టే అర్థమవుతోంది. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో మహిళల రద్దీ పెరిగింది. దీనికితోడు బస్టాండ్ ఒకే ఒక సీసీ కెమెరా ఉండడంతో దొంగలు సులువుగా తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అద్దెల రూపంలో ప్రతి నెల లక్షల రూపాయలు ఆదాయం ఉన్నా సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు వాపోతున్నారు. బస్టాండ్‌లో పోలీసులు అందుబాటులో లేకపోవడం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకుంటారనే నమ్మకం లేకపోవడంతో బాధితులు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌లో సీసీ కెమెరాలు, పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



బస్టాండ్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారు. పిక్‌పాకెటర్ల బెడద నుంచి రక్షణ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్‌లో సీసీ కెమెరాలు, పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– కొడారి వెంకటేష్, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

పోలీస్ నిఘా పెంచాలి



భువనగిరి బస్టాండ్‌లో సీసీ కెమెరాలు పోలీస్ నిఘా లేకపోవడంతో దొంగలు మూడో కంట పడకుండా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న దొంగతనాలను నివారించేందుకు బస్టాండ్‌లో పోలీసు నిఘా పెంచి నేరాలను నియంత్రిచాలని కోరుతున్నాం.

– మోదీ రాందేవ్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఆలేరు నియోజకవర్గంలో పోటెత్తిన ఓటర్లు

- 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలో 80.37శాతం నమోదు
- గతంతో పోలిస్తే 2.58శాతం పెరిగిన పోలింగ్



మల్లాపురంలో ఓటు వేసేందుకు నిల్చున్న మహిళలు (ఫైల్)

యాదగిరిగుట్ట : భువనగిరి పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 2,35,143మంది ఓటర్లు ఉండగా సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 1,94,574మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. దీంతో 82.58 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 80.37శాతం పోలింగ్ నమోదైంది. గతంతో పోలిస్తే ఈ ఎన్నికల్లో 2.58 శాతం పోలింగ్ పెరిగింది. ఓటు హక్కు వినియోగంపై అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఓటర్లను ఆకర్షించేలా ఆదర్శ, మహిళా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడంతో ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులుదీరారు. యువత, మహిళలు, వృద్ధులు, వికలాంగులు ఓటు వేసేందుకు ఆసక్తి చూపారు. వలస వెళ్లిన ఓటర్లు సైతం తమ గ్రామంలో ఓటు వినియోగించుకునేందుకు తరలి వచ్చారు. దీంతో నియోజకర్గంలో ఓటింగ్ శాతం పెరిగింది.

మండలం	మొత్తంఓట్లు	పోలైనఓట్లు	పోలింగ్‌శాతం
యాదగిరిగుట్ట	40,289	33,564	83.31
రాజాపేట	29,700	24,295	81.80
గుండాల	25,656	20,122	78.43
మోటకొండూర్	20,710	17,183	82.96
తుర్కపల్లి	27,297	24,081	87.58
బొమ్మలరామారం	29,022	25,461	87.73
ఆత్మకూరు(ఎం)	27,928	22,661	80.72
ఆలేరు	34,541	27,207	78.77

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 6.51శాతం తగ్గిన పోలింగ్

- అసెంబ్లీ ఎన్నికల్లో 84.65శాతం.. పార్లమెంట్ ఎన్నికల్లో 78.14 శాతం



రామన్నపేట : ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

రామన్నపేట : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటి పోలింగ్‌ను పరిశీలిస్తే రామన్నపేట మండలంలో వ్యత్యాసం కన్పిస్తుంది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్‌శాతం తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో 44,803ఓట్లకు 37,929ఓట్లు పోలయ్యాయి. పోలింగ్‌శాతం 84.65 నమోదైంది. సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో 44,800 ఓట్లకు 35,097మంది మాత్రమే తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో 78.14 శాతం పోలింగ్ నమోదైంది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ సారి 6.51శాతం పోలింగ్ తగ్గింది. రాజకీయపార్టీల వారు బయటి ఓటర్లను రప్పించే ప్రయత్నం చేయలేదు. దీంతో ఇతర ప్రాంతాలలో ఉన్న ఓటర్లు ఓటింగ్ దూరంగా ఉండడంతో పోలింగ్‌శాతం తగ్గింది. గ్రామాల వారీ పోలైన ఓట్లలో ఇంద్రపాలనగరంలో 3279, బోగారం 1182, వెల్లంకి 3261, సర్నేనిగూడెం 1250, సిరిపురం 3002, శోభనాద్రిపురం 1085, లక్ష్మాపురం 1325, నీర్నెముల 1210, రామన్నపేట 5010, కొమ్మాయిగూడెం 1175, దుబ్బాక 1304, మునిపంపుల 1730, పల్లివాడ 1229, సూరారం /బాచుప్పల 390, సూరారం 510, తుర్కపల్లి 443, జనంపల్లి 1394, ఇస్కిళ్ల 1110, ఎన్నారం 1343, కుంకుడుపాముల 490, కక్కిరేణి 1581, ఉత్తటూరులో 936 ఓట్లు పోలయ్యాయి.

విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

వలిగొండ : మండలవ్యాప్తంగా బుధవారం నుంచి నాలుగురోజుల పాటు ఉదయం వేళల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని మండల విద్యుత్ ఏఈ మచ్చేందర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలిగొండ సబ్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ కరెంట్ ఫీడర్ లైన్‌లో ఉన్న చెట్లను ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సిబ్బంది తొలగిస్తున్నందున విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు.

భువనగిరి నియోజకవర్గంలో 82.71శాతం

భువనగిరి : భువనగిరి పార్లమెంటుకు సోమవారం జరిగిన పోలింగ్‌లో భువనగిరి నియోజకవర్గంలో 82.71 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,20,596 మంది ఓటర్లు ఉండగా 1, 82, 462 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా భూదాన్‌పోచంపల్లి మండలంలో 40,083మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా 86.62శాతం పోలింగ్ నమోదైంది. కాగా అత్యల్పంగా భువనగిరి మండలంలో 69123మంది ఓటర్లు ఓటు హక్కు నమోదు చేసుకోగా 80శాతం పోలింగ్ నమోదైంది.

మండలం	మొత్తంఓట్లు	పోలైన ఓట్లు	శాతం
భువనగిరి	86,414	69129	80.00
బీబీనగర్	42,134	35,770	84.90
పోచంపల్లి	43,269	37,480	86.62
వలిగొండ	48,779	40,083	82.17
మొత్తం	2,20,596	1,82,462	82.71

గ్రామీణ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న చెక్క వెంకటేష్

ఆలేరురూరల్ : గ్రామీణ కోలాట కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ కోరారు. మండలంలోని శారాజీపేట గ్రామంలో శ్రీరేణుకాఎల్లమ్మ కోలాట బృందం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ కళాకారులకు గుర్తింపుకార్డులను ఇవ్వాలన్నారు. వడ్డీలేని రుణం అందజేయాలని, ఉచిత రైలుపాసులు అందించాలన్నారు. లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు కళాకారులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కళాకారుల సమస్యల పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలేంద్ర, లక్ష్మీ, నరసమ్మ, అనిత, రాణి, శిరీష, సరిత, రేణుక పలువురు గ్రామీణ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

అత్యధికంగా చౌటుప్పల్‌లో.. అత్యల్పంగా మర్రిగూడలో..

- మునుగోడు నియోజకవర్గంలో 83.70శాతం పోలింగ్
- అత్యధికంగా చౌటుప్పల్‌లో 85.72శాతం మర్రిగూడలో అత్యల్పంగా 81.43శాతం నమోదు

చౌటుప్పల్ : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధి మునుగోడు నియోజకవర్గంలో సోమవారం 83.70 శాతం పోలింగ్ నమోదయింది. మునుగోడు నియోజకవర్గంలోని మండలాల పరిధిలో 2,57,557 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,28,233 మంది పురుషులు, 1,29,321 మంది మహిళలు, ఇతరులు-01 ఉన్నారు. ఇందులో 2,15,579 ఓట్లు పోలయ్యాయి. 1,08,762 మంది పురుషులు, 1,06,816 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా చౌటుప్పల్ మండలంలో 85.72 శాతం పోలవ్వగా, అత్యల్పంగా మర్రిగూడ మండలంలో 81.43శాతం ఓటింగ్ జరిగింది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మునుగోడు, భువనగిరి, ఆలేరు, నకిరేకల్, ఇబ్రహీంపట్నం, జనగాం నియోజకవర్గలతో పోల్చినా, నలగొండ పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ నియోజకర్గాలతో పోల్చినా మునుగోడు నియోజకవర్గమే అధిక పోలింగ్ నమోదయినట్లు తెలుస్తోంది.

మండలం	మొత్తం	పోలైనవి	పురుషులు	స్త్రీలు	శాతం
చౌటుప్పల్	64,213	55,042	27,703	27,339	85.72
నారాయణపురం	39,540	33,721	17,175	16,546	85.28
మునుగోడు	37,343	31,635	15,883	15,752	84.71
చండూరు	35,099	28,769	14,474	14,294	81.97
మర్రిగూడ	30,289	24,664	12,458	12,206	81.43
నాంపల్లి	35,556	28,973	14,508	14,465	81.46
గట్టుప్పల్	15,507	12,775	6,561	6,214	82.38
మొత్తం	2,57,557	2,15,579 1,	08,762 1,	06,816	83.70

నోట్ : చండూరులో ట్రాన్స్‌జెండర్ – 01 ఓటు పోలయ్యింది.

తుంగతుర్తిలో తగ్గిన ఓటింగ్

- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 13.57 శాతం తక్కువ
- ఆసక్తి చూపని ఇతర ప్రాంతాల ఓటర్లు



తిరుమలగిరిలో ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లు

తిరుమలగిరి : భువనగిరి పార్లమెంటుకు సోమవారం జరిగిన పోలింగ్‌లో తుంగతుర్తి నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 13.57 శాతం ఓటింగ్ తగ్గింది. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు ఓటు వేయడానికి పెద్దగా ఆసక్తి కనబరచలేదు. దీంతో చాలా చోట్ల మధ్యాహ్నం తరువాత పోలింగ్ బూత్‌లు ఖాళీగా కనపడ్డాయి. పార్లమెంటు ఎన్నికలకు పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడా ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ఓట్లు అడగకపోవడం, రవాణా, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు పెద్దగా ఆసక్తి కనబరచలేదని తెలుస్తోంది. సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో 2,59,265 మంది ఓటర్లు ఉండగా 1,92,005 మంది ఓటర్లు (74.06 శాతం మంది) ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 97288 మంది, మహిళలు 94713 మంది, ఇతరులు నలుగురు ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత నవంబర్ 30వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో 2,50,017 మంది ఓటర్లు ఉండగా 2,23,163 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 1,13,229 మంది ఉండగా మహిళలు 1,09,932 మంది ఇతరులు ఇద్దరు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 87.63 శాతం ఓటింగ్ నమోదయింది. ఈసారి ఎన్నికల్లో భారీగా పోలింగ్ శాతం తగ్గింది. వేసవి కాలం కావడంతోపాటు దూర ప్రాంతాల్లో ఉన్న వారు పెద్దగా ఆసక్తి కనబరచలేదు.

మండలం	పార్లమెంటు పోలింగ్ శాతం	అసెంబ్లీ పోలింగ్ శాతం
మోత్కూరు	75.12	84.89
అడ్డగూడూరు	74.07	88.53
శాలిగౌరారం	73.20	86.93
నూతనకల్	73.39	87.70
మద్దిరాల	72.00	87.50
తుంగతుర్తి	73.25	86.80
నాగారం	71.89	87.08
జాజిరెడ్డిగూడెం	77.64	89.60
తిరుమలగిరి	75.69	89.01

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రామన్నపేట : మాట్లాడుతున్న మేక అశోక్‌రెడ్డి

రామన్నపేట : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండునెలలుగా కేవలం యాభైశాతం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారన్నారు. సగానికిపైగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉందన్నారు. ప్రతీ కేంద్రం నుంచి రోజుకు రెండులారీల చొప్పున ధాన్యం ఎగుమతయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సీపీఎం మండలకార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, గన్నెబోయిన విజయభాస్కర్, కందుల హన్మంత్, బల్గూరి అంజయ్య, కల్లూరి నగేష్,బావండ్లపల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు ట్రాక్టర్ గడ్డి అందజేత

తుర్కపల్లి: మండలంలోని దత్తాయపల్లి గ్రామానికి చెందిన మాధవరం కృష్ణయాదవ్ రాజపేట మండలం చల్లూరి గ్రామంలో ఉన్న విలేజ్ గో ఆశ్రమానికి మంగళవారం ఉచితంగా ట్రాక్టర్ గడ్డిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ తన వ్యవసాయం పొలంలోని గడ్డీ ఎండకాలం పశుగ్రాస కొరత ఏర్పాడుతుంది కాబట్టి గడ్డీని విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాల్‌రాజ్‌గౌడ్, యాదగిరి, ఎమిలేష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెల్వరాజుకు నివాళి



నివాళులర్పిస్తున్న గోద శ్రీరాములు

రాజాపేట : మండలంలోని బేగంపేట గ్రామంలో మంగళవారం సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడు ఎంపీ సెల్వ రాజు మృతికి సంతాపం ప్రకటించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు దేవి రామచంద్రం మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొల్లూరి రాజయ్య, కల్లపల్లె మహేందర్, నాయకులు చెదిదీపు రామస్వామి, జెల్ల వెంకటయ్య, బావుపేట వెంకటయ్య, కరుణాకర్, బాలరాజు, రాములు, సత్తయ్య, రాములు పాల్గొన్నారు.

నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్య తీసుకోవాలి

భువనగిరి : ఉపాధ్యాయుల పై లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మిరియాల దామోదర్, మెతుకు సైదులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం రెమ్యూనరేషన్ ఇవ్వకుండా రూ. 2400లు మాత్రమే ఇవ్వడంపై ప్రశ్నించిన ఉపాధ్యాయులపై ఆర్డీఓ లాఠీచార్జి చేయించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు పాటించకుండా రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడాలు చూపించడమే కాకుండా లాఠీచార్జ్ చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

తుర్కపల్లి: యాదగిరిగుట్ట మండల కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమావేశానికి ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్‌గౌడ్, జగదీశ్, రాజు, ఐనాల మహేందర్‌రెడ్డి, రాజిరెడ్డి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

బొమ్మలరామారం : అన్నిరంగాల్లో వెనుకబడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తూంకుంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన మండల రజక వృత్తిదారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కుల వృత్తి ఆదరణ కరువవుతున్న నేపథ్యంలో కులస్తులకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేసి జీవనోపాధి కల్పించాలన్నారు. ప్రభుత్వం రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిజర్ల భూపాల్, జూపల్లి భరత్, భాలకృష్ణ, మహేష్, అనిల్, జంగయ్య, గణేష్, లింగయ్య, పాపులు,భూములు,నగేష్, రాములు పలువురు రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..



రామన్నపేట : పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై పారుతున్న మురుగునీరు



రోడ్డు వెంట తీసిన ఇంకుడుగుంత నుంచి బయటకు వస్తున్న మురుగునీరు

- డ్రెయినేజీలు లేక రోడ్డుపై పారుతున్న మురుగు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

రామన్నపేట : మండలకేంద్రం నుంచి కొమ్మాయిగూడెం వెళ్లే రోడ్డువెంట ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నా యి. ఈ రోడ్డు వెంట డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైన పారుతుంది. దీంతో ఆ రోడ్డు వెంట వెళ్లాలంటే పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. రామన్నపేట మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ నుంచి సినిమా టాకీసు వరకు.. కొమ్మాయిగూడెం రోడ్డు వెంట సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేదు. గతంలో ఉన్నటువంటి చిన్న మురుగుకాలువ రోడ్డు ఎత్తు పెరగడంతో మట్టిలో కలిసిపోయింది.ఇళ్లలో నుంచి వచ్చే మురుగునీటి కోసం విజయ ఆస్పత్రి సమీపంలో పెద్ద ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు. ఏటా ఇళ్లలో నివాసం ఉండే కుటుంబాల సంఖ్య పెరగడం, నీటి వాడకం ఎక్కువవుతుండడంతో ఇంకుడుగుంత నిండిపోయి మురుగునీరు రోడ్డు మీదికి వస్తుంది. మురుగునీరు రోడ్డు మీద ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగునీరు పోయే మార్గం లేక పోవడంతో నివాసగృహాల వారు ఇబ్బందులు పడుతున్నారు. కాలినడకన వెళ్లేవారి పక్క నుంచి వాహనాలు వెళ్లినప్పుడు మురుగునీరు చిలికి మీద పడుతుందోని పలువురు వాపోతున్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి సినిమా టాకీసు నుంచి సుభాష్ సెంటర్ వరకు మురుగునీటి కాలువను నిర్మించి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పల్లెకు రాని బస్సులు

- పలు గ్రామాలకు బస్సు సర్వీసులను నిలిపివేసిన అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బస్సులను పునరుద్ధరించాలని ప్రజల వేడుకోలు



పుల్లాయిగూడెం వెళ్లే రోడ్డు

ఆత్మకూరు(ఎం): మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మోత్కూరు మండలం పనకబండ, రాగిబావి, ఆత్మకూరు(ఎం) మండలంలోని పుల్లాయిగూడెం, కూరెల్ల, పల్లెర్ల, ఆత్మకూరు(ఎం) మీదుగా భువనగిరి, సికింద్రాబాద్ వరకు ఆర్టీసీ బస్సు ఉండేది. అయితే ఇటీవల స్కూల్‌లకు సెలవులు ప్రకటించడంతో బస్సు సర్వీసును తాత్కాలికంగా రద్దు చేశారు. దీంతో ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆటోలు కూడా లేక తిప్పలు

మండలంలోని పుల్లాయిగూడెం గ్రామస్తులు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం మీదుగా అటు మోత్కూరుకు, ఇటు భువనగిరికి పోవడానికి రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక పోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి ప్రైవేటు వాహనాలు కూడా లేకపోవడంతో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రద్దయిన బస్సును పునరుద్ధరించాలని ఇటీవల గ్రామస్తులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే ఒకటి రెండు రోజుల్లో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ వారం రోజులు అవుతున్న గ్రామానికి బస్సు సర్వీసును ఏర్పాటు చేయలేదని పలువురు వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మా ఊరు నుంచి ఉదయం మోత్కూరు -భువనగిరికి బస్సు ఉండేది. ప్రస్తుతం ఆ బస్సును రద్దు చేశారు. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. గ్రామం మీదుగా ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు బస్సు సర్వీసులను నడిపించాలని కోరుతున్నాం.

–బత్తిని లింగయ్య, పుల్లాయిగూడెం

లిఫ్టు అడిగి పోవాల్సి వస్తోంది



మా గ్రామం మీదుగా ఉన్న బస్సు సర్వీసును ఇటీవల రద్దు చేశారు. మా ఊళ్లో ఆటోలు కూడా లేవు. దీంతో బైక్‌లు, స్కూటర్‌లు పోతే లిఫ్టు అడిగి ఎక్కిపోవాల్సి వస్తుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామం మీదుగా రెండు ఆర్టీసీ బస్సులు వేయాలని కోరుతున్నాం.

–బాషబోయిన భాగ్యమ్మ, పుల్లాయిగూడెం